ప్రజాశక్తి
మంగళవారం 26 డిసెంబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కరిగిపోతున్న కొండలు

- భీమిలిలో యథేచ్ఛగా తరలిపోతున్న గ్రావెల్
- పర్యావరణానికి తీవ్ర ముప్పు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం

ఆశ్రమానికి వెళ్లే మార్గంలో వేసిన రెయిలింగ్

ప్రజాశక్తి - భీమునిపట్నం

ప్రకృతికి, పర్యావరణానికి ఆలంబనగా ఉన్న పచ్చని కొండలు పాలకుల స్వార్థపూరిత, సంకుచిత నిర్ణయాలు, రెవెన్యూ యంత్రాంగం ఉదాసీనత ఫలితంగా భీమిలి ప్రాంతంలో కరిగిపోతున్నాయి. ఈ విషయం పలువురిని కలవరపెడుతోంది. అభివృద్ధి పేరిట పాలకులు ఈ విధ్వంసానికి తెగబడుతున్నారు. జివిఎంసి మూడో వార్డు పరిధి కస్తూర్బా బాలికల పాఠశాలకు ఆనుకుని సర్వే నెంబర్ 87లో జివిఎంసి ఆధ్వర్యాన రెండెకరాల విస్తీర్ణంలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం చేపడుతున్నారు. అందుకోసం పచ్చని మొక్కలతో అలరారుతూ ఉన్న కొండను తవ్వేశారు. కేటాయించిన స్థలానికి అదనంగా కొండను తవ్వి, గ్రావెల్‌ను తరలించడం విమర్శలకు తావిస్తోంది. ఈ గ్రావెల్ ఎక్కడకు, ఎవరి సొంతానికి తరలించారు అనేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే ఉంది. పాలకుల కనుసన్నల్లోనే ఈ తంతు జరిగి ఉంటుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కన్వెన్షన్ సెంటర్‌కు ఆనుకుని కొండను తవ్వేసిన దృశ్యం

ఆశ్రమానికి 15 ఎకరాలు కేటాయింపు

జివిఎంసి నాలుగో వార్డు కొత్తవలస సర్వే నంబర్ 73లో ఉన్న పచ్చని కొండపై ఓ స్వామి ఆశ్రమానికి ప్రభుత్వం ఏకంగా 15 ఎకరాల స్థలం కేటాయిం చేసింది. ఆశ్రమానికి స్వామి, అతని పరివారం చేరుకు నేందుకు ఏకంగా కొండపై రైలింగ్ వేశారు. వెడల్పాటి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఓ స్వామికి ఇంత పెద్ద మొత్తంలో భూమి కేటాయించిన ప్రభుత్వానికి అక్కడ పేదలు పాకలు వేసుకుంటే మాత్రం గిట్టలేదు. వారికి సెంటు మిగతా 2లో..

వన్‌టౌన్‌లో బాల ఏసుకు భక్తిశ్రద్ధలతో పూజలు

ఘనంగా క్రిస్మస్

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖ వన్‌టౌన్ ఏరియాలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే చర్చిల వద్ద ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులకు అందరూ శుభాకాంక్షలు తెలిపారు.

వార్తలు 6లో..

చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న శాంతాక్లాజ్

ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిని జయప్రదం చేయండి

వార్త 4లో..

బిజెపి పట్ల వైసిపి, టిడిపి ఉదాసీనత

వార్త 3లో..

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు

వార్త 7లో..

కె.కోటపాడులో ఉరి వేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల వినూత్న నిరసనలు

సమ్మె శిబిరాల్లోనే క్రిస్మస్ వేడుకలు

వార్తలు 8లో..

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారానికి ఆరో రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పళ్లేలు మోగిస్తూ నినాదాలు చేశారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.పుండరీకాక్ష మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ అన్ని విభాగాల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, మిగతా 2లో..

ముగింపు వేడుకలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మూడు రోజులుగా బీచ్ రోడ్డులోని గాది రాజు ప్యాలెస్‌లో జరుగుతున్న క్రెడాయ్ విశాఖపట్నం ఛాప్టర్ ప్రాపర్టీ ఎక్స్‌పో -2023 సోమవారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని తరగతుల ప్రజలకూ ఇళ్లను అందించడంలో క్రెడాయ్ విశాఖపట్నం ఛాప్టర్ సభ్యుల కృషి ప్రశంసనీయమన్నారు. రానున్న రోజుల్లో విశాఖపట్నం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఎక్స్‌పో సందర్భంగా విద్యార్థులకు అందించే బిఆర్.రాజు స్మారక అవార్డులను ఆంధ్ర విశ్వవిద్యాలయం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కరిగిపోతున్న కొండలు

స్థలమైనా ఇవ్వలేదు. మరోవైపు ఈ ఆశ్రమానికి కేటాయించిన కొండకు ఆవల ఉన్న కస్తూర్బా బాలికల పాఠశాలకు విద్యార్థినిలు, ఉపాధ్యాయులు వెళ్లేందుకు సరైన రోడ్డు లేదు. ఉన్న రోడ్డు రాళ్లు తేలి ఉంది. సమీపంలోని రాజీవ్ గృహ కల్ప గృహాలకు వెళ్లే రోడ్డు మార్గం కూడా అధ్వానంగా ఉంది. ఆశ్రమానికి స్థల కేటాయింపుపై ఉన్న శ్రద్ధ చుట్టు పక్కల సౌకర్యాలు కల్పించడంపై లేదన్న విమర్శలు ప్రభుత్వంపై వినిపిస్తున్నాయి. చిప్పాడ, కాపులుప్పాడల్లోని కొండలు సైతం పాలకుల విధానాల వల్ల కరిగిపోయాయి.

కొండే ఆధారం

ఎంతో కాలంగా కొండలను నమ్ముకుని మేం జీవిస్తున్నాం. అనాది కాలంగా మేకలు, గొర్రెలకు ఆహారంగా కొండలపై పచ్చని మొక్కలు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు పక్కన మేత కోసం మేకలను మేపునకు తీసుకెళ్లే సమయంలో ఒక్కో సారి రోడ్డు ప్రమాదాల వల్ల మేకలు చనిపోయిన సందర్భాలూ ఉన్నాయి.

నక్కెళ్ల రాము, మేకల పెంపకందారు, గొల్లలపాలెం, భీమిలి

కొండలు ప్రజల ఆస్తి

సామాన్యులకు సెంటు భూమి కేటాయించడానికి ప్రభుత్వాలు ఎన్నో ఆంక్షలు, నిబంధనలు పెడుతున్నాయి. ఓ ఆశ్రమానికి స్థానిక కొండపై ఏకంగా 15 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. కొండలు ప్రజల ఆస్తి. వాటిని కాపాడుకోవడం ప్రజల బాధ్యత. ప్రజల అభిప్రాయం తీసుకోకుండానే కొండలపై ఆశ్రమాలకు స్థలాలు కేటాయిస్తున్నారు. కొండలు తవ్వగా వచ్చే గ్రావెల్‌ను ఇష్టానుసారంగా తోలుకుపోతున్నారు.

ఆర్ఎస్ఎన్.మూర్తి, సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీములు అమలు పరచాలని కోరారు. సమ్మెలో భాగంగా మంగళవారం భిక్షాటన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎల్.చైతన్య, గణపతిరావు పాల్గొన్నారు.

ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

నుంచి ఆర్కిటెక్చర్‌లో ప్రతిభ కనబరిచిన సలాది సౌమ్య సోవిత్ ఖడ్కా, బత్తుల జగదీష్ రెడ్డిలకు అందజేశారు. కార్యక్రమానికి క్రెడాయ్ విశాఖపట్నం అధ్యక్షులు ధర్మేందర్ వరద అధ్యక్షత వహించగా చైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు, కార్యదర్శి, ఎక్స్‌పో కన్వీనర్ వి.శ్రీను పాల్గొన్నారు. ఎక్స్‌పోను విజయవంతం చేసిన నగర వాసులకు ధన్యవాదాలు తెలిపారు.

998వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఉక్కును ప్రైవేటుకు కట్టబెట్టే ప్రయత్నాలను తక్షణం విరమించాలని పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 998వ రోజుకు చేరాయి. దీక్షల్లో పిఒడబ్ల్యు కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ ఉక్కు అందరి హక్కు అన్నారు. అశేష త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఈ ప్రజా ద్రోహ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖలోనూ, రాష్ట్రంలోనూ కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకొని ప్రభుత్వ రంగంలోనే స్టీల్‌ప్లాంట్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు వెయ్యి రోజులుకు చేరుకుంటున్న తరుణంలో బుధవారం డిఆర్ఎం కార్యాలయం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ వేలాది మందితో మహా ప్రదర్శన, అనంతరం సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అన్ని తరగతుల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీక్షల్లో సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.వెంకటలక్ష్మి, నాయకులు రోహిణి, ఈసరపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ అడ్వకేట్ క్రికెట్ జట్టుకు సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న ఎనిమిదవ లాయర్స్ ప్రపంచ కప్‌లో పాల్గొనే ఇండియన్ అడ్వకేట్ క్రికెట్ జట్టుకు ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సురేష్ కుమార్ ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుండి నలుగురు క్రీడాకారులు ఎంపిక కాగా విశాఖపట్నం నుంచి పి.సురేష్ కుమార్ ఎంపికయ్యారు. లాయర్స్ ప్రపంచ కప్‌లో భారతదేశంతో పాటు శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలు పాల్గొననున్నాయి.

సురేష్ కుమార్

స్టైలిష్ వింటర్

పోలీస్ బ్యారెక్స్ వద్ద సాగుతున్న అమ్మకాలు

విశాఖ నగరంలో సరికొత్త నులివెచ్చని దుస్తులు లభ్యం
పెరిగిన వ్యాపారం

ప్రజాశక్తి-కలెక్టరేట్ : కొద్ది రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. ఈ క్రమంలో నులివెచ్చని దుస్తులూ విశాఖ నగర మార్కెట్లోకి వచ్చేశాయి. ఈ ఏడాది కూడా శీతాకాలపు దుస్తులు ఫ్యాషన్ ట్రెండ్‌కు తగ్గట్టుగా వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. అమ్మకాల ఆసరాగా శీతాకాలపు జీవితాల్లో కాస్త ఆనందం చూసే చిరు వ్యాపారులు కొందరైతే, చలి దుస్తుల్ని ముచ్చటపడి కొనుక్కుని చలిగింతల్లో తేలియాడేవారు ఇంకొందరు. మారిన రుతువులకు అనుగుణంగా దుస్తులు మారాలి. కేవలం దుస్తులు మారితే ఏముంది.. స్టయిల్ కూడా మారాలి. అందుకే ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉన్ని దుస్తులు సరికొత్త సొగసులు అద్దుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నేడు వెచ్చదనాన్నిచ్చే ఉన్ని, కాటన్, సింథిటిక్‌లతో తయారు చేసిన మోడరన్ చలి దుస్తులతో నగర మార్కెట్ కళకళలాడుతోంది. బ్రాండెడ్ కంపెనీలన్నీ సరికొత్త వింటర్ వేర్‌తో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి.

నగరంలోని ఆశీల్ మెట్, ద్వారకానగర్, డాబాగార్డెన్స్, దొండపర్తి, సిరిపురం, మద్దిలపాలెం, జగదాంబ జంక్షన్లలో ఉన్న విశాఖపట్నం సెంట్రల్, సిఎంఆర్ సెంట్రల్, వుడ్ ల్యాండ్, యుఎస్ఐ, అడిడాస్, లివైన్, ఫిక్కర్, ఎంఎఫ్ ఖాన్, బాయ్ లాండ్, మెన్ క్యాకామ్ తదితర బ్రాండెడ్ షోరూమ్‌ల్లో శీతాకాల ఉన్ని దుస్తులు ఆకర్షణీయమైన రంగుల్లో అందుబాటులో ఉన్నాయి. వులెన్, సింథటెక్, వింటర్ వేర్, స్కార్ఫ్‌తో కూడిన క్వాలిటీ దుస్తులు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా మహిళలకు విత్ క్యాంప్ లాంగ్ వింటర్ వేర్, స్కార్ఫ్‌తో కూడిన ఊలు దుస్తులు, వీనెల్, సోలో, నెక్, స్టెప్స్ తదితర వెరైటీస్ లభ్యమవుతున్నాయి. ఇక యువకుల కోసం ప్రింటెండ్ స్టైలిష్ జాకెట్లు, కోట్లు, కార్ డ్రే షర్ట్స్, స్వీట్ లెస్ స్వెట్టర్స్ అందుబాటులో ఉన్నాయి. మల్టీ పర్పస్‌గా ఉపయోగించే షార్ట్ జీన్స్, కోట్స్, జర్కిన్లు, లెదర్ జాకెట్లకు మంచి గిరాకీ ఉంది.

రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు..

నగరంలో ప్రధానమైన షోరూంల్లో కాటన్, వులెన్, లెదర్, సింథటిక్ జర్కిన్లు రూ.3 వేలు నుంచి రూ.20 వేలు మధ్య ధరల్లో లభిస్తున్నాయి. సీజన్ల బిజినెస్ కావడంతో రోజుకు రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు విక్రయాలు సాగుతున్నట్లు దుకాణదారులు చెబుతున్నారు. అలాగే ఫుల్ హేండ్స్ ప్రొప్లాంట్స్, టీ స్వెట్టర్లు యువతను ఆకట్టుకుంటున్నాయి. రూ.2,800 నుంచి రూ.5 వేలు ధరల్లో ఇవి లభిస్తున్నాయి. బొచ్చు (యూనియన్ ఫైబర్) వంటి ప్రత్యేక హంగుల తయారీ దుస్తులు మరో ప్రత్యేక ఆకర్షణ. వీటిలో రూ.30 వేల ధర వరకూ ఉన్నాయి.

స్కార్ఫ్ అనగానే మొహానికి చుట్టుకునో లేదా మెడలో వేసుకుని ఉండే అమ్మాయిలే గుర్తుకు వస్తారు. కానీ ఇప్పుడు ఇది అబ్బాయిల ఫ్యాషన్ కూడా. మెడలో స్కార్ఫ్ వేసుకోవడం లేదా కట్టుకోవడం అనేది ఈనాటిది కాదు. వాతావరణాన్ని బట్టి కొన్ని ప్రాంతాల్లో ఎప్పటి నుంచో వాడుకలో ఉంది. మన దగ్గర మాత్రం 20వ శతాబ్దం నాటికి ఇదో ఫ్యాషన్ యాక్సెసరీగా స్థిరపడింది. బాలీవుడ్ హీరోలు దేవానంద్, రాజేష్ ఖన్నాల వంటి వారు తరచూ సినిమాల్లో స్టైలిష్ స్కార్ఫ్‌లతో కనిపించేవారు. మిగిలిన రోజుల్లో కంటే చలి కాలంలో స్కార్ఫ్ మెడకు చుట్టుకోవడం వల్ల వెచ్చగా ఉంటుంది. పైగా మఫ్లర్లతో పోలిస్తే స్కార్ఫ్‌లో వెరైటీలు ఎక్కువే. మెడలోని స్కార్ఫ్‌లను రకరకాలుగా ముడులు వేయడం వల్ల వాటి లుక్కు మారిపోతుంది. స్కార్ఫ్‌ల్లో అమ్మాయిలువే కాదు... అబ్బాయిలు ధరించే స్కార్ఫ్‌ల్లోనూ రకరకాలు ఉన్నాయి. అబ్బాయిల స్కార్ఫ్‌లు 6 నుంచి 14 అంగుళాలు వెడల్పు, 50 నుంచి 90 అంగుళాలు పొడవు వరకూ ఉన్నవి లభ్యమవుతున్నాయి.

స్వెట్టర్ల అమ్మకాలకు కేరాఫ్ బ్యారెక్స్

చలి తీవ్రత పెరిగిందంటే నగర వాసులందరికీ గుర్తుకొచ్చేది పోలీసు బ్యారెక్స్! ఎందుకంటే ఈ సీజన్ లో వెచ్చదనాన్ని పంచే ఉన్ని దుస్తుల విక్రయం అక్కడే ఎక్కువగా జరుగుతుంది మరి. వివిధ డిజైన్ల స్వెట్టర్లు, కోట్లు ఇక్కడ లభ్యమవుతాయి. ఇక్కడి విక్రేతలను చూస్తే వారు నేపాల్ నుంచో ఈశాన్య రాష్ట్రాల నుంచో వచ్చిన వారో అనుకుంటాం. అయితే అది నిజం కాదు. ఇక్కడి విక్రేతల మూలాలు టిబెట్‌లో ఉన్నాయి. టిబెట్ నుంచి 1959లో భారత్‌కు వీరు వలస వచ్చారు. మన దేశానికి వచ్చిన వారిలో కొందరు పక్క రాష్ట్రమైన ఒడిశాలోని గజపతి జిల్లాలో స్థిరపడ్డారు. వీరే నగరానికి వచ్చి ఈ శీతాకాల దుస్తుల విక్రయం చేపడుతున్నారు. వేసవి, వర్షాకాలంలో ఉన్ని దుస్తులను రూపొందించి వాటిని శీతాకాలంలో విశాఖతో పాటు కొన్ని నగరాల్లో అమ్మకాలు చేస్తుంటారు.

లాభసాటి సీజన్

ఇది మాకు లాభసాటి సీజన్, యువతీ, యువకుల ఫ్యాషన్ అభిరుచులకు తగ్గట్టుగా, నాణ్యతతో కూడిన కోట్స్, లెదర్ జర్కిన్స్, ఉన్ని, కాటన్లతో తయారు చేసిన జాకెట్లను నెల రోజుల నుంచి విక్రయిస్తున్నాం. రోజుకు లక్ష రూపాయలకు పైగా వ్యాపారం సాగుతోంది.

కె సుఖేష్, షోరూమ్ మేనేజర్, ద్వారకానగర్

విశ్వేశ్వర చంద్రచూడ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జైపూర్ రాజు కీర్తిశేషులు మహారాజా విక్రందేవ్ వర్మ మనవడు విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్ 29వ జన్మదిన వేడుకలు సోమవారం ఉదయం టౌన్‌లోని మోతీ మహల్‌లో నిరాడంబరంగా జరిగాయి. నిరుపేదలకు వస్త్రాలు పంచిపెట్టారు. అన్నదానం చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్ మాట్లాడుతూ మహారాజా విక్రందేవ్ వర్మ హయాంలో ఎయును అభివృద్ధి చేశారన్నారు. వర్సిటీకి భూములు ఇవ్వడంతో పాటు భవనాలు కట్టించారని గుర్తుచేశారు. వర్సిటీకి తమ వంతు సేవలు ఎల్లవేళలా అందిస్తామన్నారు. కార్యక్రమంలో మహారాణి సారిక దేవి, కిషన్ రాథోడ్, సంస్థానం ఉద్యోగులు పాల్గొన్నారు.

రోజా, అంబటి వ్యాఖ్యలపై జనసేన నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విజయవాడలో జరిగిన వ్యూహం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మంత్రులు రోజా, అంబటి రాంబాబు, దర్శక నిర్మాత రాంగోపాల్ వర్మలు జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. వర్మ, రోజా, రాంబాబు ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలను చెప్పులతో కొట్టారు. ఈ సందర్భంగా జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్ మాట్లాడుతూ అంబటి రాంబాబు ఆంబోతులా రంకెలు వేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడటం దారుణమన్నారు. జనసేనను చంద్రబాబుకు తాకట్టు పెట్టారని ఆరోపణలు చేయటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో 33వ వార్డ్ కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మి, నాయకులు పందిరి శివప్రసాద్ రెడ్డి, పంచకర్ల సందీప్, చీకటి రమేష్ పాల్గొన్నారు.

జగన్ హయాంలో పెరిగిన అవినీతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగన్ హయాంలో రాష్ట్రంలో మునుపెన్నడూ లేనంత స్థాయిలో అవినీతి పెరిగిపోయిందని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ఎటువంటి అభివృద్ధీ లేదన్నారు. కొద్దిరోజుల క్రితం తాను పులివెందుల వెళ్లి అన్ని ప్రాంతాలనూ పరిశీలించానన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో రౌడీయిజాన్ని పెంచి పోషించారన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి విశాఖ పార్లమెంటు కార్యదర్శి బోడేపూడి దొరబాబు, డాక్టర్ పపూర్ నికుంజ్, బిసి సెల్ నాయకులు దువ్వి పరమేశ్వరరావు పాల్గొన్నారు. క్రిస్మస్ పర్వదిన సందర్భంగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్‌ను రామ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**NO.3. Order 5 RULE 3
SUMMONS TO APPEAR IN PERSON
IN THE HONOURABLE COURT
OF THE JUNIOR CIVIL JUDGE AT
GAJAPATHINAGARAM.
in O.S. NO. 79/2020.**

BETWEEN:
Gandi Sarojini and another .....Plaintiffs.
AND:
Koripalli Kamu Naidu (died) & others.
......Defendants.

To,
Karuturi, Satya Sravani, @ Saravani d/o Someswara Rao, aged about 25 years, Hindu, r/o Door No. 8-45-16, 4th line, China Waltair colony, Vidhya Nagra, Vishakahapatnam-17. (8th defendant)

Whereas the plaintiff has instituted a suit against you, you are hereby summoned to appear in this court in person on 3rd day of **January 2024 at 10-30 (a.m.)** hours to answer the claim, and further you hereby directed to file within 30 days of service of summon a written statement of your defense and you are directed to produce on that day all documents upon which you intend to rely in supporting of your defense.

Take notice that in default of your appearance on the day before men- tioned, the suit will be heard and determined in your absence.

Reddy. Srinivasa Naidu,
Advocate,
Gajapthinagaram.

**NOTICE TO APPEAR IN PERSON
IN THE HONOURABLE COURT
OF THE JUNIOR CIVIL JUDGE AT
GAJAPATHINAGARAM.
I.A. 313/2022 in O.S. NO. 79/2020.**

BETWEEN:
Gandi Sarojini and another. ...Petitioners.
AND:
Koripalli Kamu Naidu (died)& others.
...Respondents.

To,
Karuturi, Satya Sravani, @ Saravani d/o Someswara Rao, aged about 25 years, Hindu, r/o Door No. 8-45-16, 4th line, China Waltair colony, Vidhya Nagra, Vishakahapatnam-17. (8th respondent)

Whereas the petitioners filed this petition for amendment of plaint, you are hereby ordered to appear in this court in person on **3rd day of January 2024 at 10-30 (a.m.)** hours to answer the claim, and further you hereby directed to file within 30 days of service of summons a counter of your defense and you are directed to produce on that day all documents upon which you intend to rely in supporting of your defense.

Take notice that in default of your appearance on the day before mentioned, the petition will be heard and determined in your absence.

Reddy. Srinivasa Naidu,
Advocate,
Gajapthinagaram.

బిజెపి పట్ల వైసిపి, టిడిపి ఉదాసీనత

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్

ప్రజాశక్తి -తగరపువలస : విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిన బిజెపి పట్ల రాష్ట్రంలోని ప్రధాన పార్టీలుగా చెప్పుకుంటున్న అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కెఎ.పాల్ విమర్శించారు. క్రిస్మస్ సందర్భంగా సోమవారం తగరపువలస వచ్చిన ఆయనమీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, ఇవ్వాల్సిన నిధులను గట్టిగా అడిగితే కేంద్రంలోని బిజెపి జైల్లో పెడుతుందని సిఎం జగన్మోహన్‌రెడ్డి, మాజీ సిఎం చంద్రబాబు భయపడుతున్నారని తీవ్రంగా విమర్శించారు.

విశాఖ నుంచి ఎంపీగా పోటీ

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేయనున్నట్లు కెఎ.పాల్ తెలిపారు. విశాఖ జిల్లాలోని భీమిలి, గాజువాక తదితర ఏడు నియోజక వర్గాల నుంచి శాసనసభ స్థానాలకు తమ పార్టీ పోటీ చేయనున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో ఎక్కువ సార్లు రెండు కులాలే రాజకీయ అధికారం పొందాయన్నారు. అత్యధిక శాతం జనాభా ఉన్న బిసిలు, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలు ఈ దఫా రాజకీయ అధికారం సాధించాలని స్పష్టం చేశారు.

పవన్ కల్యాణ్ కు బంపర్ ఆఫర్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపితో కలిసి ఉన్న జనసేన కు తమ పార్టీ సీట్ల కేటాయింపులో బంపర్ ఆఫర్ ఇస్తున్నట్లు కెఎ.పాల్ ప్రకటించారు. టిడిపి, జనసేనకు కేవలం 24 సీట్లు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, తమ పార్టీతో పొత్తుకు సిద్ధమైతే పవన్ కల్యాణ్‌కు 48 సీట్లు ఇస్తానని చెప్పారు.

నేడు రెడ్డిపల్లిలో గడపగడపకు...

ప్రజాశక్తి- పద్మనాభం: రెడ్డిపల్లిలో మంగళవారం నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైసిపి అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు కోరారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొనే ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు హాజరు కావాలని కోరారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రతినిధి

మత్తు పదార్థాల నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం : మత్తు పదార్థాల నిషేధంపై మండలంలోని అనంతవరం గ్రామంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడ్ ఆర్గనైజేషన్ న్యూ లైఫ్ సెంటర్ ఫర్ హెల్పింగ్ సంస్థ ప్రతినిధి కాళీ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వల్ల యువకులు ఎక్కువగా బానిసలవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివివై.నాయుడు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను కమ్మేసిన తీగలు

ప్రజాశక్తి -పద్మనాభం : విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను తీగలు అల్లుకుంటున్నాయి. వీటిని తొలగించేందుకు ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరంతరమూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు తీగలు దట్టంగా అల్లుకోవడంతో ఆ సమీపంలో మేత కోసం వెళ్లిన పశువులు, మేకలు, గొర్రెలు విద్యుదాఘాతానికి గురవుతున్నాయి. వర్షాకాలంలో మనుషులు కూడా వీటి వల్ల ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. పాండ్రంగి సమీపంలో ఒక స్తంభానికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కూడా కనిపించకుండా తీగలు అల్లుకుపోయాయి. గ్రామస్థాయిలో విద్యుత్తు శాఖ సిబ్బంది వీటిని చూస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు.

ప్రజలు ఆదరిస్తే సమస్యల పరిష్కారానికి కృషి

నాగోతు నాగమణి

ప్రజాశక్తి-మధురవాడ : భీమిలి నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగోతు నాగమణి తెలిపారు. జివిఎంసి 7వ వార్డులో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తానని వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ముఖ్యంగా సింహాచలం పంచగ్రామాల సమస్య, కాపులుప్పాడ డంపింగ్ యార్డు, మధురవాడ ప్రజల తాగునీరు, ట్రాఫిక్ సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. బాల్యం, విద్య, వివాహం అన్నీ తగరపువలసలోనేనని, కొంతకాలంగా అనిట్స్, అవంతి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉద్యోగం చేసిన తాను ప్రస్తుతం, బోయిపాలెంలోని వైజాగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ (విప్స్)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోతి భాస్కరరావు, పోతిన సత్యనారాయణ, బైపల్లి రామకృష్ణ, బైపల్లి సతీష్, బైపల్లి నరేంద్ర కుమార్, పోతిన సూర్యారావు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

వడ్డాది : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 99వ ఆవిర్భావ దినోత్సవం బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జెండాను పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో రావాడ వరహాలు, వరి సూరిబాబు, గనివాడ రాము, రావాడ రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని గింజర్తి, తాళ్ళ చీడికాడ గ్రామంలో సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శులు మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ మాట్లాడుతూ, దోపిడీదారులకు, పెత్తందారులకు వ్యతిరేకంగా నిరంతరం సిపిఐ పోరాటం చేస్తుందన్నారు.మాయ మాటలు చెప్పి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న ప్రభుత్వాలపై నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శులు కె.రాంబాబు, పి.బాలరాజు, ఎఐవైఎఫ్ సిహెచ్.భరత్ కుమార్, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు

గాజువాక : ప్రజల పక్షాన సిపిఐ రాజీలేని పోరాటం సాగిస్తోందని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ చెప్పారు. సిపిఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం గంగవరంలో ఘనంగా నిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు పల్లేటి పోలయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, సిపిఐ 99 సంవత్సరాలుగా ప్రజల పక్షాన నిరంతరం పోరు సాగిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు కూడా పోరాడుతోందన్నారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన ఘనత సిపిఐకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.పోతన్న, జి.ఆనంద్, కెంగువ అచ్యుతరావు, వై.నందన్న, పి.దుర్గారావు, సోమేష్, మాధవరావు, ఎరిపిల్లి దానయ్య, మహిళలు పెంటమ్మ , ధనలక్ష్మి పాల్గొన్నారు.

వడ్డాదిలో సిపిఐ జెండాను ఎగురవేసిన ఆ పార్టీ నాయకులు

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండలం మామిడిలోవ గ్రామానికి చెందిన బలిరెడ్డి సంతోష్‌కుమార్ (35) అదృశ్యమైనట్లు తల్లి దేవుడమ్మ ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలావున్నాయి... బలిరెడ్డి సంతోష్ ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి నేటికీ ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుమారుడు వేములవలసలో పద్మ పూజిత ఆటో కన్సల్టెన్సీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. పనిచేసిన ప్రదేశం, స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేదని రోదించారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 9494180790 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

దగ్ధమైన పూరిల్లు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని సిహెచ్ లక్ష్మీపురం గ్రామంలో గ్రామానికి చెందిన పి.రాజులమ్మకు చెందిన పూరిల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సోమవారం మధ్యాహ్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు మంటలను అదుపు చేశారు. ఇంట్లో ఉన్న సామగ్రి కాలి బూడిదయ్యింది. సుమారుగా 50 వేలు నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

పేదలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా

సామాజిక సేవలోనే సంతృప్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : సామాజిక సేవలోనే సంతృప్తి ఉంటుందని స్థానిక శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం అధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. స్థానిక పీఠం వద్ద సోమవారం పీఠం 22వ వార్షికోత్సవం నిర్వహించారు. సామాజిక సేవ ద్వారానే మానవత్వానికి పరిపూర్ణత ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 42 మంది పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. నూతన సంవత్సర పాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ ఆనంద్, డివి.నారాయణరావు, ఎన్.కృష్ణ, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ పోస్టుకు జిలానీ ఎంపిక

ప్రజాశక్తి-సీలేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్) ఫలితాల్లో జికె.వీధి మండలం సీలేరుకు చెందిన యువకుడు షేక్ జిలానీ ఎంపికయ్యాడు. జిలానీ రెండో సంవత్సరంలో తల్లి షేక్ శతాబ్ది చనిపోవడంతో సీలేరులో తన అమ్మమ్మ షేక్ లాల్‌బీ పోషణలో పెరిగాడు. ఒకటి నుంచి ఆరో తరగతి వరకు తన సొంత గ్రామమైన కాకినాడలో మౌలానా అబ్దుల్ కలాం పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం ఏడు నుంచి పదవ తరగతి వరకు సీలేరు కాన్వెంట్‌లో, ఇంటర్మీడియట్, డిగ్రీ నాగార్జున సాగర్ ఏపి గురుకుల కళాశాలలో పూర్తి చేశాడు. 2022లో సివిల్ ఎస్సై పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఇంటి దగ్గర ఉంటూ ఆన్‌లైన్‌లో శిక్షణ పొంది జిలానీ ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. అమ్మమ్మ పేదరికంలో ఉన్నప్పటికీ చదువుకు తోడ్పాటు అందిస్తూ ప్రోత్సహించినట్లు తెలిపారు.

ఆదర్శంగా 'ఆడుదాం ఆంధ్రా'

మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవనుందని ఉత్తర నియోజక వర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పేర్కొన్నారు. మంగళ వారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రారంభం నేపథ్యం లో సోమవారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రాకు ఇప్పటివరకు సుమారు కోటి 40 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు.

ప్రజల దృష్టిని మళ్లించే విధంగా అయ్యన్నపాత్రుడు, ఇతర టిడిపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని కెకె.రాజు విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి కోసం జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు.

పవన్ తీరు హేయం

ప్రజాశక్తి-సీతమ్మధార :కాపుల ఆత్మాభిమానాన్ని తెలుగుదేశం పార్టీకి జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాకట్టు పెట్టారని వైసిపి కాపు నేతలు ఆరోపించారు. వైసిపి కాపు యువత ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలువురు కాపు యువ నాయకులు మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాపులకు ఎంతో అన్యాయం జరిగిందన్నారు. కాపు నాయకులు కలవాలంటే చంద్రబాబు అపాయింట్‌మెంట్ కూడా ఇచ్చేవారు కాదని, అలాంటి పార్టీకి మద్దతు పలుకుతూ పవన్ కల్యాణ్ కాపులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన మద్దతుతో పోటీచేసిన ప్రతి ఒక్కరినీ ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ ఠాగూర్, సమ్మిట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మాధవధారలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పరిశీలించారు. మాధవధారలో జరుగుతున్న సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను, యుజిడి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, జెసిఎస్ మండల కన్వీనర్ అమర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల వాజ్‌పేయి జయంతి

ప్రజాశక్తి- యంత్రాంగం

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల నిర్వహించారు.

ఆనందపురం : ఆనందపురం బిపివి కల్లాలు రోడ్డులో వాజ్‌పేయి జయంతిని బిజెపి మండల అధ్యక్షులు మీసాల రామనాయుడు ఆధ్వర్యాన నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ అప్పారావు, గండ్రెడ్డి వెంకటరావు, ఉప్పాడ కృష్ణ, శివ, నిమ్మకాయల అప్పలరాజు, మీసాల వెంకటలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని డిఎల్ పురంలో అటల్ వాజ్‌పేయి జయంతి వేడుకలను సోమవారం భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గింజాల అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.నక్కపల్లి లో బిజెపి కార్యాలయం వద్ద పార్టీ మండల శాఖ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

కశింకోట : మండలం, తాళ్ళపాలెం రన్ వే హోటల్ దగ్గర మాజీ ప్రధాని వాజ్‌పాయ్ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నగంటి అప్పారావు, కరక సత్యనారాయణ, అప్పికొండ అప్పారావు, పప్పు ఈశ్వరరావు, అయినాల శ్రీను, పంచాడ గంగరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్‌పేయి చిత్ర పట్టానికి సోమవారం ఇరువాడ గ్రామంలో అభిమానులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేవిఎస్ రాజు, పట్టాభి ప్రసాద్, ముత్యాల అప్పారావు, డి.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిని జయప్రదం చేయండి

స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలో మంగళవారం జరిగే అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిని జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. ప్లాంట్‌లోని సిఎంఎస్ కేథరిన్ పాయింట్ వద్ద స్టీల్ సిఐటియు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం మొండిగా జిందాల్‌తో ఒప్పందం చేస్తోందని, దీనిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్‌తో అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిరసన యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఒక గట్టి గుణపాఠం కావాలన్నారు. యాజమాన్యం తమ వైఖరిని పునరాలోచించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, కార్మికుల వేతన ఒప్పందంలో యాజమాన్య వైఖరి దుర్మార్గంగా ఉందన్నారు. పెరుగుతున్న ధరలతో, నూతన కార్మికులు చాలీచాలని జీతాలతో ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. యాజమాన్యం వైఖరిని మార్చుకుంటూ నూతన వేతనాలు అమలుకై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, ఉక్కు ఉద్యమానికి సంఘీభావంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఈనెల 27వ తేదీకి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నారని, దానిలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్టీల్ సిఐటియు కార్యకర్తలు పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, కెవి.సత్యనారాయణ, బిఎన్.మధుసూదన్, విడివి పూర్ణచంద్రరావు, సూర్యనారాయణ, రమణమూర్తి, ముత్యాలనాయుడు, లోకేష్, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై కాలయాపన తగదు

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావు

మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ వర్కర్లను కనీసం కార్మికులుగా కూడా గుర్తించకపోవడం అన్యాయం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో హక్కుల గురించి అడిగితే చంద్రబాబు గుర్రాలతో తొక్కించారని, తరువాత ఎన్నికల్లో ఆ ప్రభుత్వం కూలి పోయిందని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు రాకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు ఒ.వి.రావు, నమ్మి రమణ, కెఎం.శ్రీనివాస్, పి.శ్రీనివాసరాజు, కె.సత్యవతి, పి.నారాయణరావు, ఎన్.కృష్ణ, యు.సోమేష్, డి.పాండే, కెపి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌ఎంకు గణబాబు అభినందనలు

రైల్వే డిఆర్‌ఎమ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : సింహాచలం రైల్వే స్టేషన్ వెనుక అండర్ పాత్ నిర్మాణ పనులు చేపట్టడంతో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు సోమవారం విశాఖ రైల్వే డిఆర్‌ఎంను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు మీడియాతో మాట్లాడుతూ, డిఆర్‌ఎం రెండు రోజులుగా ఇక్కడే ఉండి పనులు వేగవంతం అయ్యేలా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రెండో అండర్ పాత్ వే నిర్మాణానికి రైల్వే శాఖకు ప్రతిపాదనలను పంపించాలని కోరారు. ఇక్కడ అండర్ పాత్ నిర్మాణం పూర్తయిన తర్వాత, ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉందన్నారు. సబ్బవరం, శీలానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఇది చాలా అనువుగా ఉంటుందన్నారు. రైల్వే క్రాసింగ్ గేటు క్లోజ్ చేసిన తర్వాత ఇక్కడ భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. నగరంలో రైల్వే నిర్మించిన అండర్ పాత్‌లలో అత్యంత పొడవైనది ఇదేనని చెప్పారు. సింహాచలం రైల్వే స్టేషన్ పైనుంచి వెళ్లే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూడా అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం నిర్మాణపనుల్లో పాల్గొన్న కార్మికులకు అభినందనలు తెలుపుతూ, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు విజయ్ కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెజీషియన్ బిఎస్.రెడ్డికి అటల్ గౌరవ్ సమ్మాన్ అవార్డు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ నగరానికి చెందిన ఇంటర్నేషనల్ మెజీషియన్ బిఎస్.రెడ్డికి అంతర్జాతీయ అటల్ గౌరవ్ సమ్మాన్- 2023 అవార్డును కేంద్ర మహిళా శిశు సంక్షేమం శాఖ సహాయ మంత్రి డాక్టర్ మహేంద్ర కలుభాయ్ ముంజపర న్యూఢిల్లీలో అందించారు. భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి సంగ్రాలయ్ హాల్లో అటల్ ఫౌండేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కలిగి దేశ విదేశాల్లో తమ ప్రతిభ పాటవాలతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వారిని గుర్తించి పురస్కారాలను అందజేశారు. విశాఖవాసి బిఎస్.రెడ్డికి ఈ అవార్డు రావడంతో నగరానికి చెందిన పలువురు మెజీషియన్లు, వివిధ కళా సంస్థల అధినేతలు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి మధురవాడలోని నారాయణ ఆంగ్ల మాధ్యమికోన్నత పాఠశాలలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస్ రామానుజన్ 136 వ జయంతి సందర్భంగా గణిత దినోత్సవ సంబరాలను వైభవంగా నిర్వహించారు. గణితంలో అనేక రకాల చిక్కు ప్రశ్నలకు విద్యార్థులు అంకెలతో విన్యాసాలు చేస్తూ అలరించారు. విద్యార్థులకు తరగతుల వారిగా క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ఎజిఎమ్ అందించారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల ఎజిఎమ్ రాజ్‌కుమార్, ఆర్ఐ రఘు, పాఠశాల పర్యవేక్షకులు శివప్రతాప్, ప్రధానోపాధ్యాయులు లలిత తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎంపీగా పోటీ : పాల్

ప్రజాశక్తి -గాజువాక, తగరపువలస : విశాఖ ఎంపీగా పోటీ చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ అన్నారు. పాత గాజువాక జంక్షన్‌లో సోమవారం రాత్రి పేదలకు దుప్పట్లను కెఎ.పాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలన్నా, విశాఖ అభివృద్ధి చెందాలన్నా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ పాల్గొన్నారు.

తగరపువలస : క్రిస్మస్ సందర్భంగా సోమవారం తగరపువలస వచ్చిన కెఎ.పాల్ పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న కెఎ.పాల్

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని చెరువుల్లో వ్యర్థ రసాయనాలు విడిచిపెడుతున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వైసిపి మండల మాజీ అధ్యక్షులు బొడ్డపు చిన్నారావు డిమాండ్ చేశారు. పరవాడలోని పెద్ద చెరువు వద్ద రైతుల నిర్వహిస్తున్న 16వ రోజు దీక్షలను సోమవారం ఆయన సందర్శించి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం అక్రమంగా చెరువుల్లోకి సిఈటిపి నుండి వ్యర్థ రసాయనాలను విడిచి పెడుతుందని, దీని వల్ల మత్స్య సంపద నాశనమవుతుందని, వ్యవసాయ పంటలు దెబ్బతింటున్నాయని, పాడిపశువులు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీలు విడిచిపెడుతున్న కాలుష్యం వల్ల ఈ ప్రాంత ప్రజలు క్యాన్సర్, ఊపిరితిత్తులు, కిడ్నీ, చర్మ, శ్వాసకోస సంబంధిత వ్యాదులకు గురై తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఫార్మాసిటీ నిర్వహణ చూస్తున్న రాంకీ యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కాంట్రాక్టర్లుగా అవతారమెత్తిన స్థానిక నేతలు యాజమాన్యానికి అండగా నిలవడం వల్లనే ఈ ప్రాంతంలో ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించకుంటే రాంకీ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఎస్ఎస్ నాయుడు, గోపి, పైల నాయుడు, జి శ్రీనివాసరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్ష చేస్తున్న రైతులు

ఆసుపత్రి ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

రేడియంట్ హెల్త్ కేర్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం ఆంధ్రాబ్యాంక్ రోడ్, వ్యాపారవీధిలో రేడియంట్ హెల్త్ కేర్, డెంటల్ హాస్పిటల్‌ను ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ సోమవారం ప్రారంభించారు. ఈ ఆసుపత్రిని ధర్మశ్రీ తమ్ముడు జయదేవ్ కుమార్తె, అల్లుడు అయిన డాక్టర్ ప్రసన్న, పవన్ సంతోష్ ప్రారంభించారు. ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న వారికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మ శ్రీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో చోడవరంలో సూపర్ స్పెషాలిటీ స్థాయిలో ఆసుపత్రులు నిర్వహించడం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, రాజకీయ ప్రముఖులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, బంధువులు మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దట్టంగా కురుస్తున్న పొగ మంచు

దట్టంగా పొగ మంచు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పొగ మంచు దట్టంగా కురిసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు పొగ మంచు దట్టంగా కురుస్తుండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాల సైతం కనిపించిన పరిస్థితి నెలకొంది. మండలంలోని బంగారుమెట్ట, చిన్నప్పన్నపాలెం, దిబిడి, బుచ్చయ్యపేట కందిపూడి తదితర గ్రామాల్లో పొగ మంచు విపరీతంగా కురిసింది. దీంతో వాహందారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు. ఏజెన్సీ ప్రాంతం వలే పొగ మంచు దట్టంగా కురవడంతో పలువురు ప్రకృతి ప్రేమికులు మంచు దృశ్యాలను ఆస్వాదించారు.

ఎస్ఐ పోస్టుకు జిలానీ ఎంపిక

ప్రజాశక్తి-సీలేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్) ఫలితాల్లో జికె.వీధి మండలం సీలేరుకు చెందిన యువకుడు షేక్ జిలానీ ఎంపికయ్యాడు. జిలానీ రెండో సంవత్సరంలో తల్లి షేక్ శతాబ్ది చనిపోవడంతో సీలేరులో తన అమ్మమ్మ షేక్ లాల్‌బీ పోషణలో పెరిగాడు. ఒకటి నుంచి ఆరో తరగతి వరకు తన సొంత గ్రామమైన కాకినాడలో మౌలానా అబ్దుల్ కలాం పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం సీలేరు కాన్వెంట్‌లో ఏడు నుంచి పదవ తరగతి వరకు చదువుకున్నాడు. ఇంటర్మీడియల్, డ్రిగీ బిఎ నాగార్జున సాగర్ ఎపి గురుకుల కళాశాలలో పూర్తి చేశాడు. అనంతరం 2022లో సివిల్ ఎస్సై పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో తన ఇంటి దగ్గర ఉంటూ ఆన్‌లైన్‌లో శిక్షణ పొందిన జిలానీ పట్టుదలతో చదివి, ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. తన అమ్మమ్మ పేదరికంలో ఉన్నప్పటికీ తను ఉన్నత స్థాయికి ఎదగడానికి చదువుకు తోడ్పాటు అందిస్తూ ఎంతో ప్రోత్సహించినట్లు జిలానీ తెలిపారు.

కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని ఇరువాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని సోమవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డెడ ప్రసాద్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, సర్పంచ్ పిల్ల సతీష్, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

మనుధర్మ శాస్త్రం ప్రతుల దహనం

మనుధర్మ శాస్త్ర ప్రతులు పట్టుకొని నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-చోడవరం

అంబేద్కర్ ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనం వద్ద మనుధర్మ శాస్త్ర పత్రులను దహనం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ భవనం చైర్మన్ నడుపూరి దేవుడు మాస్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ కులరహిత సమాజం కోసం అహర్నిశలూ పోరాటం చేశారని తెలిపారు. అంబేద్కర్ భవన్ ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వరప్రసాద్ మాట్లాడుతూ మధ్య ఆసియా ప్రాంతం నుండి వచ్చిన ఆర్య బ్రాహ్మణుల్లో ఒక్కరైనా మనువు "మను చరిత్ర" అనే గ్రంథంలో మొట్ట మొదటిసారి కులవ్యవస్థను గురించి ప్రస్తావన చేశారని తెలిపారు. అంతకు ముందు ఎన్నడూ కుల వ్యవస్థ భారతదేశంలో లేదని, సృష్టిలో ఏ జీవరాశిలో లేనటువంటి కులం మానవులకు ఎందుకు వచ్చిందని ప్రస్తావిస్తూ కుల ప్రస్తావన తీసుకువచ్చిన మనుధర్మ శాస్త్రాన్ని అంబేద్కర్ తగలబెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మత్యలింగం, ఎన్ఎస్.భాస్కరరావు, ఎన్.నూకరాజు, మాజీ ఎంపిటిసి పొట్నూరు అప్పలరాజు, వివిధ మండలాలకు చెందిన సహదేవుడు, ఎం.రాజకొండ, ఎం.కన్నారావు, పరమేశ్వరరావు, మచ్చా గిరి, యాబాక మల్లేశ్వరరావు, ఆర్.తాతారావు, పొట్నూరు అప్పారావు, వై.రాము, పి.పూర్ణశ్రీరాము, బి.రాము, కె.వెంకటరమణ పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-సబ్బవరం

యడ్ల నాయుడు

వైసీపీ యువజన విభాగం మండల అధ్యక్షునిగా మొగలిపురం గ్రామానికి చెందిన యడ్ల నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం యడ్ల నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. తమపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్‌కు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్దార్థరెడ్డికి, జిల్లా వైసీపీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్‌కు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పి.సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. నాయుడు నియామకం పట్ల మండలంలోని పలువురు యువకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అచ్యుతపురం : వైసిసి యువజన విభాగం అచ్యుతాపురం మండల అధ్యక్షుడిగా శరగడము జగ్గారావును నియమించారు. గతంలో ఇతను ఇదే పదవిలో ఉండగా, తిరిగి మరల జగ్గారావునే నియామకం చేశారు. దీంతో జగ్గారావు నియామకం పట్ల పలువురు హర్షం తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి

ప్రజాశక్తి-పరవాడ

జివిఎంసి 79వ వార్డు పరిధి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తెలిపారు. వార్డు పరిధిలోని లంకెలపాలెం ఆర్‌కె లేఅవుట్‌లో వైభవ్ అపార్ట్మెంట్ అసోసియేషన్ సమావేశం సోమవారం జరిగింది. ఇందులో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్య, వీధిలైట్ల సమస్య, లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లో జిమ్ ఏర్పాటు, డ్రైన్ల నిర్మాణం తదితర సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు.

సమావేశంలో మాట్లాడుతున్న 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అమ్మవారి చిత్ర పటాన్ని ఇస్తున్న జైవీరు తదితరులు

నూకాంబికను దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన శ్రీనూకాంబిక అమ్మవారిని సోమవారం తెలంగాణ హైకోర్టు జడ్జి ఎంజి ప్రియదర్శిని దంపతులు దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో బండారి ప్రసాద్, వైసీపీ నాయకులు దాడి జై వీర్ అమ్మవారి చిత్రపటం ప్రసాదాన్ని అందజేశారు.

'ఆడుదాం ఆంధ్రా'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -మునగపాక : ఈనెల 26వ తేదీ నుండి జనవరి తొమ్మిదవ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక ఎంపీడీవో మన్మధరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాలలో ఈ ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 26, 27 తేదీలలో వాలీబాల్, 28, 29, 30 తేదీలలో కబాడీ, 2, 3 తేదీలలో బాల బ్యాడ్మింటన్ లేక షటిల్, 4, 5 తేదీలలో ఖోఖో, 6, 8, 9 తేదీలలో క్రికెట్ ఆటలు నిర్వహింపబడతాయని, పోటీలలో పురుషులు, స్త్రీలు పాల్గొనవచ్చునని తెలిపారు.

ఎంపీని కలిసిన ఉగ్గిన, వేగి

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి యువజన విభాగం అనకాపల్లి మండల అధ్యక్షులుగా నియమితులైన ఉగ్గిన నూక అప్పారావు సత్యనారాయణ, వేగి త్రినాధ్ సోమవారం పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి దంపతులను వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సత్యవతి విష్ణుమూర్తి దంపతులు వారిని అభినందించారు.

ఉగ్గిన, వేగిని అభినందిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

కాజ్‌వే నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట దగ్గర కూలిపోయిన బ్రిడ్జి పక్క నుంచి కాజ్‌వే (సైడ్ రోడ్డు) నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల రాకపోకలకు వీలుగా ఈ కాజ్‌వే నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ రోడ్డు మార్గం వెంట ఆటోలు, బైకులపై వెళ్లే వారికి ఉపయోగపడుతుందని, త్వరలోనే నూతన బ్రిడ్జ్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యల్లపు విజయ్ కుమార్, స్థానిక నాయుకులు, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి, వెంకుపాలెం వృద్ధాశ్రమంలో సంజీవని స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో రోగులు, బాలింతలు, పిల్లలు సుమారు 200 మందికి వివిధ రకాల పండ్లు, రొట్టెలు, గ్లూకోస్ సోమవారం పంపిణీ చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ హిమశేఖర్ విద్యాసంస్థల చైర్మన్ కె.పరమేష్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని సూచించారు. సంజీవని స్వచ్ఛంద సేవా సంఘం అధ్యక్షులు పి.సురేష్ మాట్లాడుతూ ఇబ్బందుల్లో వున్న వారికి సహాయ సహకారం అందించడానికి తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంజీవని సంఘం సభ్యులు కె.గోపి కృష్ణ, నాగశివ, శేషు, పూర్ణ, మళ్ల సాయి, జగన్, భాగ్యలక్ష్మి, రాధా, రమేష్ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో తరలిపోతున్న పరిశ్రమలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రానికి గతంలో వచ్చిన ఎన్నో పరిశ్రమలు వైసిపి ప్రభుత్వం హయాంలో తరలిపోతున్నాయని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా సమన్వయకర్త కొణతాల వెంకటరావు విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తీరుతో పెట్టుబడుదారులు వెనకడుగు వేస్తున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెట్టిన రూ.1,21,729 లక్షల కోట్లు పెట్టుబడి ద్వారా ప్రభుత్వానికి ప్రతి ఏటా రూ.2,728.78 కోట్ల జిఎస్టి రాబడి రాగా, దానిని నేడు కోల్పోయిందని, ఐదు సంవత్సరాలలో రూ.13,643.89 కోట్లు రాష్ట్రానికి నష్టం జరిగిందని తెలిపారు. పరిశ్రమలు వచ్చి ఉంటే 2 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చి ఉండేవని పేర్కొన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో 6 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పిన మాటలు, దెయ్యాల వేదాల వల్లించిన రీతిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ అసమర్థత కారణంగా నాలుగేళ్లు 450 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని అవన్నీ జగన్ రెడ్డి హత్యలేనని వెంకటరావు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి కార్యదర్శి భువనేశ్వరరావు, బుద్ధ వాణిజ్య విభాగ జిల్లా అధికార ప్రతినిధి కర్రి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నేత వెంకటరావు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ప్రసాద్

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి నుండి మంగళవారం వరకు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు చర్చల్లో కేకులు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి ఏసుక్రీస్తు గీతాలు ఆలపించారు.

మునగపాక : క్రీస్తు జీవితం అనుసరణీయమని, ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చిన మహనీయుడని వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మండలంలోని గంగాదేవిపేటలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భీశెట్టి గంగప్పలనాయుడు, మొల్లేటి దేవి చంద్ర, మద్దాల వీరు నాయుడు, పాస్టర్లు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలోనూ, మండలంలోని చింతలపాలెం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ వేర్వేరుగా పాల్గొని కేక్‌లు కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న చింతలపాలెం చర్చి పునర్నిర్మాణానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా రత్నాకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో కశింకోట చర్చి ఫాస్టర్ సన్నీ జేమ్స్, చర్చి అధ్యక్షులు మంత్రి మోసెష్ మాస్టర్, జడ్పిటిసి మాజీ సభ్యులు పీటర్ వైజ్‌మాన్, కోటా నాగేశ్వరరావు, సర్పంచ్ మంత్రి జయరంజని, టిడిపి నాయకులు గొంతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజా సీతయ్యపేట తదితర గ్రామాల్లోని చర్చిల్లో సోమవారం క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుండి చర్చిలకు చేరుకుని ప్రార్థనలు చేశారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, ఎల్బీపురం, కోమల్లపూడి, కొండపాలెం చర్చిలలో ఏసుక్రీస్తు ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిలన్నీ సందడిగా మారాయి. వడ్డాది జంక్షన్లో ఉన్న చర్చిలో పాస్టర్ నోవాహు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని ఆంధ్రా బాప్టిస్టు చర్చి, సెయింట్ పాల్ కేథలిక్ చర్చిలో పాస్టర్లు క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కేక్‌లు కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తుమ్మపాలలో పాస్టర్ కొత్తపల్లి జయరాజు ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో పీలా గోవింద పాల్గొని పేదలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొణతాల శ్రీనివాసరావు, కర్రి వెంకట సన్యాసినాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం నిస్సి మినిస్ట్రీస్, సీయోను ప్రార్థన మందిరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. రెవ బిషప్ టైటస్ గొర్లె, గ్రేస్ టైటస్ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పాల్గొని కేక్ కట్ చేసి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశాఖకు చెందిన నిర్మల్ కుమార్, దీవెనమ్మ దంపతులు వృద్ధులకు, వితంతువులు, చిన్న పిల్లలకు క్రిస్మస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాశీపురం గ్రామ పెద్దలు, సీయోను ప్రార్థన మందిరం సభ్యులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చిల వద్ద సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల వద్ద పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. పాస్టర్ ప్రశాంత్ మండల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

సబ్బవరం : సబ్బవరం సాయినగర్ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ క్రిస్మస్ సంబరాల్లో పాల్గొని క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే తన సొంత నిధులుతో చర్చిలోని సుమారు 75 కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికీ 5 కిలోల బియ్యం, కిలోపంచదార, కిలో కంది పప్పు చొప్పున పంపిణీ చేశారు. వైసీపీ మండల అధ్యక్షులు కర్రి బాబు, ఎంపీపీ బొకం సూర్య కుమారి రాము నాయుడు, కోటాన రాము, కాపుశెట్టి శేషు బాబు, సబ్బవరపు నారాయణమూర్తి, మండల లక్ష్మణ్, ఇరత నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. మోసయ్యపేట పిల్లాడిల్ఫియా చర్చిలో ఏ శ్యాం ఆధ్వర్యంలో బాలబాలికలతో పలు సంస్కృత కార్యక్రమాల ప్రదర్శన చేశారు. ప్రార్థనలు చేశారు.

మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో క్రిస్టియన్ సోదర, సోదరీమణులతో కలిసి వైసిపి సమన్వయకర్త కెకె.రాజు కేక్ కట్ చేశారు. వారందరికీ కేకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు, కిరణ్ రాజు, పైడి రమణ పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడ పరిసరాలలో ఉన్న పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పరదేసిపాలెం, బోయపాలెం నేతన్య చర్చిలలో వేడుకలు జరిగాయి. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఆరాధన ప్రార్థనల్లో నేతన్య సంస్థల అధ్యక్షులు బిషప్ డాక్టర్ కెఆర్.సింగ్ దైవ సందేశం చేశారు. ఈ కార్యక్రమంలో బిషప్ డాక్టర్ కెఆర్.సింగ్, కార్పొరేటర్ మొల్లి హేమలత పాల్గొన్నారు. శివశక్తినగర్ రోడ్డు అయ్యప్పనగర్‌లో బైబిల్ మిషన్ చర్చి ప్రతినిధి బంక అప్పారావు, గ్రేస్ మేరీ ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, 5వ వార్డు కార్పొరేటర్ హేమలత, నమ్మి రమణ కెక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఎంవివి.సత్యనారాయణ

భీమునిపట్నం : శాంతి, ప్రేమకు ప్రతి రూపం క్రిస్మస్ అని స్థానిక ఎమ్మెల్యే ముత్తం శెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి, తగరపువలసలో ఉన్న చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. క్రైస్తవ సోదరులు కేక్ కట్ చేసి పండగ జరిపారు. ప్రార్థనలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవ మత పెద్దలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు

వైఎంసిఎ అధ్యక్షులు కెఎస్ఎం.సుధాకర్ ఆధ్వర్యాన చిట్టివలసలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సిఐ వెంకటరావు, ప్రముఖ దంత వైద్యులు గణేష్, భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ జనార్ధనరావు తదితరులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి, టిడిపి, సిఐటియు నాయకులు ఎం.షణ్ముఖరావు, వై.అనిల్ ప్రసాద్, ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, మాజీ కౌన్సిలర్ కె.రాంబాబు, మాజీ ఎన్‌జిఒ నాయకులు కె.ముత్యాలరావు, రిటైర్డ్ హెచ్ఎం దత్తి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా శాంతి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కెఎ.పాల్ పాల్గొన్నారు. సిఐటియు భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.వెంకట లక్ష్మి, పద్మావతి, శ్రీదేవి, అనురాధ పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 60వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లో చర్చి పాస్టర్ కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వైసిపి నగర ప్రధాన కార్యదర్శి సరగడం పత్నీరావు కేకును కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కామాక్షి, సుబ్బలక్ష్మి, ఉమ, రాజా, మాధురి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : 38వ వార్డులోని బిలీవర్స్ ఈస్టన్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో దక్షిణఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గం 13, 16వ వార్డుల్లో సోమవారం క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు, తూర్పు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ హాజరయ్యారు. కార్యక్రమంలో వార్డుల కార్పొరేటర్లు మొల్లి లక్ష్మి, అప్పారావు, కెల్ల సునీత, సత్యనారాయణ, ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు, బోణి శివరామకృష్ణ పాల్గొన్నారు.

పాయకరావుపేట : మండలంలోని అరట్లకోట ఎంబి చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో సంఘ విశ్వాసులు హాజరై యేసు క్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. యువతీ, యువకులు గీతాలు ఆలపించారు. యువకులు బాణా సంచా కాల్చి సందడి చేశారు. గ్రామంలోని పలు వీధుల్లో కేరల్స్ తిరిగారు. ఈ కార్యక్రమంలో బిషప్ కె సుధాకర్ రాజు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

చర్చిలో ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు, పిల్లలు

27 నుంచి రామానాయుడు పాదయాత్ర

ప్రజాశక్తి-చీడికాడ:ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే ఈనెల 27వ తేదీ నుండి పాదయాత్ర చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు చీడికాడ మండలంలో అప్పలరాజుపురం గ్రామంలో పార్టీ కార్యాలయంలో సోమవారం చీడికాడ, మాడుగుల మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ, మాడుగుల మండలం శంకరం పంచాయతీ నుండి పాదయాత్ర ప్రారంభమవుతుందని, తాను అధికారంలో లేకున్నా 2002 నుండి 2023 వరకు ప్రజల మధ్యలోనే ఉన్నానన్నారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాల్లో ముందుండి చేయూత అందిస్తున్నానని తెలిపారు. బుధవారం నుంచి చేపట్టే పాదయాత్రకు ప్రజల ఆశీస్సులు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎలక్షన్లో మాడుగుల నియోజకవర్గం కోటపై ప్రజల ఆశీస్సులతో టిడిపి జెండా ఎగరడం ఖాయమని రామానాయుడు జోస్యం చెప్పారు. నియోజకవర్గంలో 111 పంచాయతీలలో ఈ పాదయాత్ర జరుగుతుందన్నారు. ఈ పాదయాత్ర ను కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ఇంచార్జులను మార్చుతున్నా, ఏపీ ప్రజలు మాత్రం ఏకంగా జగన్ రెడ్డినే మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నాటకాలు ఆడిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు వైసీపీని

మాట్లాడుతున్న రామానాయుడు

నమ్మరన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు పోతల రమణమ్మ, పుప్పాల అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పోతల చిన్నం నాయుడు, కార్యదర్శులు తాతారావు, దేముడు, టీడీపీ నాయకులు గండి ముసలినాయుడు, డోకల అక్కునాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు

- మున్సిపల్ కమిషనర్ రవిబాబు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీ లోని 17 సచివాలయాలలో ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ప్రారంభం కానున్నాయని మున్సిపల్ కమిషనర్ రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పెదబొడ్డేపల్లి ఏపిఆర్ఎస్ పాఠశాల వద్ద జరిగే ఈ పోటీలను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభిస్తారన్నారు. వార్డు మెంబర్లు, కోఆప్షన్ మెంబర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రావికమతం: ఈనెల 26 నుంచి ఆడదాం ఆంధ్ర పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని 22 గ్రామ సచివాలయ పరిధిలో ఈనెల 26 నుంచి జనవరి 9వ వరకు సచివాలయ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిం చనున్నామని తెలిపారు. ఈ పోటీలను ఆయా సచివాలయాల కార్యదర్శులు, పీఈటీల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపిటీసీలు పోటీలను ప్రారంభించాలని కోరారు. ఈ క్రీడల్లో ఆసక్తి ఉన్న బాల, బాలికలు పాల్గొనాలని ఆయన కోరారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

తవ్విన ప్రాంతంలో గొయ్యి

తవ్వేసి వదిలేశారు..

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రధాన కూడలి వద్ద ఇటీవల తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు సమీప ప్రాంతం ముంపునకు గురయ్యింది. దీంతో, ప్రధాన రహదారి వద్ద కాలువను అడ్డంగా తవ్వి నీటిని మళ్లించి అలా వదిలేశారు. వరద నీటిని మళ్లింపు విషయంపై కొండను తవ్వి ఎలకలు పెట్టారంటూ పలువురు విమర్శిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రదేశం కావడంతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుంది. రాత్రి సమయంలో రహదారి సక్రమంగా కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి తవ్వినదానిని పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అశ్వ వాహన సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అర్చక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుని ఉత్సవమూర్తులను అంసవాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, పీసపాటి వేంకట శేషాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు, నండూరి వెంకట రాజగోపాలాచార్యులు, ఇల్లింద వెంకట గోపాలచార్యులు, నండూరి వెంకట అప్పల రంగాచార్యులు, దేవస్థానం

ఊరేగిస్తున్న అర్చకులు, గ్రామస్తులు

సిబ్బంది గురవయ్య గ్రామానికి చెందిన రేజేటి సింగరాచార్యులు, యు.వి. రంగనాథ స్వామి పలువురు భక్తులు పాల్గొన్నారు.

పూడుస్తున్న గుంతలు

వ్యాపారి సహకారంతో..

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి -రావికమతం:మండలంలోని కవగుంట గ్రామంలో రోడ్డుపై గుంతలను పూడ్చి వేస్తున్నామని సర్పంచ్ దాసరి కుమారి, వరహాలు సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రావికమతం నుంచి కింతలికి వెళ్లే గ్రామం మధ్యలో తారు రోడ్డులో గుంతలు ఉండటంతో వాహన చోదకులు, పాదచారులు ప్రయాణాలు సాగించేందుకు ఇబ్బంది పడు తున్నారన్నారు. ఓ వ్యాపారి సుమారు 70 వేలు విలువ చేసే మెటల్ పిక్కను ఇవ్వడంతో గ్రామంలో గుంతలు పూడ్చి వేయడం జరిగిందన్నారు.

ఎపిటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి-నక్కపల్లి:ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా నక్కపల్లి మండలం సంఘ పూర్వపు అధ్యక్షులు దాడిశెట్టి కొండలరావు ఎంపికయ్యారు. ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో తనను ఎంపిక చేసినట్లు కొండలరావు తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్లో నక్కపల్లి కి స్థానం కల్పించినందుకు గాను జిల్లా శాఖకు ఏపిటిఎఫ్ నక్కపల్లి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొల్నాటిరావు, కృష్ణ, అప్పలరాజులు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర కౌన్సిల్‌గా ఎంపికైన కొండలరావుకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ధర్మారావు దుర్గాప్రసాద్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కేకేఎల్ఎన్. ధర్మారావు, చిరికి దుర్గాప్రసాద్ ఎన్నిక య్యారు. ఈ మేరకు దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాప్రసాద్ మండలంలో నేతవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపా ధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఏపిటిఎఫ్ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని చోద్యం గ్రామంలో సోమవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై గ్రామ సచివాలయంలో అవగాహన కల్పించారు. అనంతరం ఎంపిడిఒ డేవిడ్ రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు తెలిసేలా చేయడం, లబ్ధి పొందేలా చేయడం ఈ కార్యక్రమంలో ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి రఘురాం, గొలుగొండ వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, విప్పల పాలెం సర్పంచ్ శ్రీనివాస్, ఆత్మ సిబ్బంది కిషోర్, కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు

ప్రజాశక్తి - చింతపల్లి : మండలంలోని కొమ్మంగి పంచాయతీ లంకపాకలు గ్రామంలో ఎట్టకేలకు మంజూరైన సిమెంట్ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆ పంచాయతీ సర్పంచ్ పాంగి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జర్త రూతు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి నిధుల మంజూరుకు కృషి చేశారన్నారు.

శ్రమదానంతో రహదారి మరమ్మతులు

ప్రజాశక్తి-హుకుంపేట:తుపాన్‌తో మండ లంలోని ఉర్రాడ బొడ్డపుట్టు నుంచి మదనపురం వరకూ రహదారి కొట్టుకు పోయింది. ఈ రోడ్డు పాడైపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. స్కూల్‌కి పిల్లలు వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు ఆ గ్రామానికి అంబులెన్స్ వెళ్ళలేదు. ఆసుపత్రికి వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కలకు ఈ రహదారి ఆనుకొని 50 గ్రామాలు ఉన్నాయి. దీంతో, స్థానిక సర్పంచ్ సోమెలి సత్యవతి ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ప్రభుత్వం చొరవ తీసుకుని నూతన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు అడేరి రాము, తాంగుల రవి, మజ్జి బాలకృష్ణ, మజ్జి రామారావు, మజ్జి చిన్న మజ్జి బాలయ్య, రామారావు, మహేష్ కోరారు.

నగదును ఇస్తున్న ఎమ్మెల్యే గణేష్ కుమార్

పేదలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న, వివిధ రకాల వ్యాధులు బారినపడిన పేదలకు ఎమ్మెల్యే గణేష్ కుమార్ రూ 35 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి రూ.5 వేలు చొప్పున ఇచ్చారు. 38వ వార్డుకు చెందిన పినపల్లి బంగారయ్య, 37వ వార్డుకు చెందిన దేవర శ్రీను, 31వ వార్డుకు చెందిన వెంపడం అప్పారావు, దండిలా రాజు, 27వ వార్డుకు చెందిన మైనం అప్పారావు సాయం పొందిన వారిలో ఉన్నారు. 30వ వార్డు కెజిహెచ్ వార్డ్ బాయ్స్ కాలనీలో క్రిస్మస్ వేడుకలకు రూ.10 వేలను ఎమ్మెల్యే వాసుపల్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల వైసిపి అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - చింతపల్లి:- గిరి రైతులకు కేంద్ర ప్రభుత్వం పంచాయతీ కేంద్రాల ద్వారా రాయితీపై అందిస్తున్న డ్రోన్లను గిరి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దురియా పుష్పలత కోరారు. స్థానిక పంచాయతీ కేంద్రం వద్ద సోమవారం డ్రోన్ల వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ డ్రోన్ల ఖరీదు 6 లక్షల రూపాయలు ఉండగా అందులో రైతులకు 40 శాతం రాయితీపై అందిస్తామన్నారు. ఈ డ్రోన్‌తో సమయం ఆదా చేసుకోవచ్చని, ఎనిమిది నిమిషాలలో ఒక ఎకరం పిచికారి పనులు పూర్తి చేయవచ్చన్నారు. ఎరువులు, విత్తనాలు డ్రోన్ల ద్వారా చల్లు కోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వి నగర్ వైద్యాధికారి రాజా రవీంద్ర చౌదరి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె శిబిరాల్లో క్రిస్మస్ వేడుకలు

గొలుగొండలో కేక్ కట్ చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె సోమవారం 14వ రోజుకు చేరింది. సమ్మె శిబిరాల్లో అంగన్‌వాడీలు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌లను కట్ చేసి తమ నిరసనలు తెలిపారు.

నక్కపల్లి: అంగన్వాడి వర్కర్స్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 14వ రోజుకు చేరింది. మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద అంగన్వాడి వర్కర్స్ చేస్తున్న సమ్మెకు టిడిపి నేతలు వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ రమణ మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, అంగన్వాడి వర్కర్స్ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 14 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ, నేటి వరకు ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగలక్ష్మీ,

నర్సీపట్నంలో...

రమణమ్మ, జయ, ఆర్‌వికె లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

.**రావికమతం:** అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. తమకు టిడిపి, జనసేన, సిపిఎం, ఆశా వర్కర్లు, అడ్వకేట్స్, పలు ప్రజా సంఘాల వారందరూ మద్దతు ప్రకటించారని ప్రాజెక్టు కార్యదర్శి సత్యవేణి తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చే అంతవరకు తాము సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి.వరలక్ష్మి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటవురట్ల: ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని గడిచిన 14రోజులుగా అంగన్వాడీలు చేపడుతున్న దీక్షలు క్రిస్మస్ పర్వదినం సోమవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, హామీలు నెరవేర్చే వరకు దీక్షను నిర్మించేది లేదన్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 14వ రోజుకు చేరింది. క్రిస్మస్ సందర్భంగా ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద అంగన్వాడీలు కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పండగ పూట కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాల్సిన తాము రోడ్లపై నిరసన చేపట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం తమకు జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో

14వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, మీడ్డేమీల్ పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.ప్రసన్న, సిఐటియు కన్వీనర్ టి.ఈశ్వరరావు, అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు వి.సామ్రాజ్యం, కృష్ణవేణి పాల్గొన్నారు.

గొలుగొండ: సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీల నిరసన 14వ రోజుకు చేరింది. క్రిస్మస్ సందర్భంగా అంగన్వాడీలు కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పండుగ పూట ఇంటి వద్ద ఉండకుండా నిరసన అంటూ రోడ్లపై తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

కశింకోటలో పసిపాపను ఊయలలో ఊగిస్తూ నిరసన చేపడుతున్న అంగన్‌వాడీలు

అంగన్వాడీల వినూత్న నిరసనలు

దేవరాపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా 14 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు సోమవారం క్రిస్మస్ సందర్భంగా దీక్షా శిబిరంలో కేక్ కట్ట చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి తీనిపించి నిరసన తెలిపారు. మనస్సు మార్చుకొని తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ శిశుసంక్షేమశాఖ మంత్రి చీరలకు, మొబైల్ ఫోన్లకు రీచార్జీలకు ఖర్చు చేశామని చెప్పడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, నాయకులు బిటి దొర, అంగన్వాడీలు జి.వరలక్ష్మి, పి.కన్నతల్లి, సన్యాసమ్మ, కె.కోమలి, చెల్లయ్యమ్మ, జయ పాల్గొన్నారు.

పెందుర్తిలో క్రిస్మస్ వేషధారణలో నిరసన

పరవాడ : పరవాడ తాసిల్దార్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు సందర్భంగా అంగన్వాడీలు కేక్ కట్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్.దేవి, ఎస్ పార్వతి, కే లక్ష్మి, కృష్ణవేణి, ముత్యాల రాణి, దేవి, నీలిమ, కుమారి తదితరులు పాల్గొన్నారు

రాంబిల్లి : మండల కేంద్రంలోని ఆందోళన శిబిరంలో అంగన్వాడీలు క్రిస్మస్ కేక్ కట్ చేసి, చెవిలో పువ్వులు పెట్టి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, మండల కన్వీనర్ చందక రామకృష్ణ, సిపిఎం నాయకులు ధోని అప్పలరాజు, అంగన్వాడి యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భీమిలిలో కేక్ కట్ చేస్తున్న కెఎ.పాల్

సబ్బవరం : మండల కేంద్రంలో అంగన్వాడీల ధర్నా శిబిరంలో క్రిస్టమస్ వేడుకలు నిర్వహించి నిరసనలు కొనసాగించారు. క్రిస్టమస్ కేక్ ను కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వివి.రమణమ్మ, ఎం.వరలక్ష్మి, పుష్ప, జగదీశ్వరి, వి.సుభాషిణి, ఎం.కనకమ్మ, జి.అరుణ కుమారి, ఎస్.రమణమ్మ, డి.భారతి, ఎ.రమణమ్మ, పి.సూరమ్మ, ఎస్.సత్యవేణి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలు క్రిస్మస్ కేక్ కట్ చేసి, కొవ్వొత్తి వెలిగించి వేడుకలు చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ కార్యకర్తలు ధర్నాను కొనసాగించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మా డిమాండ్ల నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

మునగపాక : అంగన్వాడీల న్యాయబద్ధమైన కోర్కెలు ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రం మునగపాకలో అంగనవాడీలు చేపట్టిన 14వ రోజు నిరసన శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, పెంటకోట విజయ్, జనసేన పార్టీ నాయకులు టెక్కలి పరశురాం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, అంగన్వాడీలు రామలక్ష్మి, జయలక్ష్మి, హేమలత, సరస్వతి, తులసి లక్ష్మి, వెంకట సత్యవతి పాల్గొన్నారు.

చిన్నారికి జోల పాటతో నిరసన

కశింకోట : తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీలు కసింకోట దీక్షా శిబిరంలో 14 రోజు చిన్నారిని ఉయ్యాలలో వేసి ఊపుతూ జోల పాట పాడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు మాట్లాడుతూ 14 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పరిష్కారం చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కొమ్మోజు దేవిక, రాల్లపుడి మాధవి, పి.పుష్ప, పి.సత్యవతి, కె.ధనలక్ష్మి, ఎం.నారాయణమ్మ, టి.శ్యామల, రజనీ, పార్వతి, గంగవేణి, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెడకు ఉరితాళ్లతో నిరసన

కె.కోటపాడు : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు సోమవారం మండల కేంద్రంలోని దీక్షా శిబిరంలో మెడకు ఉరితాళ్లు బిగించి నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్రా దేముడు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విశాఖ కలెక్టరేట్ : బానిసల విముక్తి కోసం ఉద్యమించిన ఏసుక్రీస్తును శిలువ వేసి బంధించినట్టు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీల సమస్యలను తీర్చకుండా సంకెళ్లతో వారిని బంధించారని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి విమర్శించారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని 14 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వినూత్నంగా నిరసన తెలిపారు. ఓ అంగన్వాడీ కార్యకర్త శిలువు మోస్తూ తమ బాధను వెళ్లగక్కింది. కార్యక్రమంలో భాగంగా మణి మాట్లాడుతూ అంగన్వాడీలు కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి, నాయకులు కె.నూకరత్నం, ఈశ్వరమ్మ, రాధారాణి పాల్గొన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పిఒడబ్ల్యు రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, ఎపిఎస్ ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సీతాలక్ష్మి మద్దతు తెలిపారు

తగరపువలస : అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు

పరవాడలో..

ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లు న్యాయమైనవని, ఇవేమీ గొంతెమ్మ కోర్కెలు కాదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా సోమవారం తగరపువలస వచ్చిన ఆయన పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల వర్కర్లు, సహాయకులను కలిసి వారి పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వీరి డిమాండ్లను పరిష్కరించకుంటే మూడు నెలల్లో జరిగే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ఓటమి తథ్యమని వ్యాఖ్యానించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించనందునే గత ఎన్నికల్లో టిడిపి అధినేత చంద్రబాబు ఓటమి చెందారని గుర్తు చేశారు.

అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న కెఎ.పాల్

పెందుర్తి : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు శిలువపై ఉన్న జీసస్ రూపంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు అనిత మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పట్టనట్లు వ్యవహరించడం జగన్మోహన్‌రెడ్డికి తగదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బృందావతి, భవానీ దేవి పాల్గొన్నారు.

కోటవురట్లలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

నక్కపల్లిలో మద్దతు తెలుపుతున్న టిడిపి నేతలు